మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంప్రదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 213 24 బుధవారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-



నేతాజీ
మరణించిన తేదీ ఇప్పటికీ
ప్రజలకు తెలియకపోవడం
దేశానికే
సిగ్గుచేటు అన్న దీదీ
బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా
ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శ
రాజకీయ కార్యక్రమాలకు
సెలవును ప్రకటిస్తున్నారన్న
మమతా బెనర్జీ

## నేతాజీ సుభాష్ చంద్రబోస్
## ఏమయ్యారనేది ఇప్పటికీ తెలియకపోవడం
# అవమానకరం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యమై దశాబ్దాలు గడుస్తున్నా.. ఆయనకు ఏమైందనే విషయం ఇప్పటికీ తెలియకపోవడం అవమాన కరమని పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ అన్నారు. నేతాజీ 127వ జయంతి సందర్భంగా కోల్‌కతాలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దీదీ మాట్లాడుతూ... నేతాజీ మరణించిన తేదీ ఇప్పటికీ ప్రజలకు తెలియకపోవడం దేశానికే సిగ్గుచేటు అన్నారు. బోస్ అదృశ్యంపై దర్యాప్తు చేస్తామని బీజేపీ చెప్పిందని... కానీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్యా లయాలకు ఒక పూట సెలవు ప్రకటించడాన్ని దీదీ ప్రస్తావిస్తూ... ఈ రోజుల్లో రాజకీయ కార్యక్రమాలకు సెలవు ప్రకటిస్తున్నారని, కానీ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన నేతాజీ వంటి వారికి మాత్రం సెలవు లేదని విమర్శించారు. నేతాజీ జయంతి రోజున జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని ఏళ్లుగా పోరాటం చేసినా ఫలితం లేదన్నారు.

## సార్వత్రిక ఎన్నికలకు
# కాంగ్రెస్ సన్నద్ధం

25న హైదరాబాద్‌తో బూత్ లెవల్ మీటింగ్

ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఖర్గే

హైదరాబాద్,జనవరి 23(మరో ఉదయం):



రానున్న సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు మొదలుపెట్టింది. దీనిలో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రస్థాయిలో కార్యకర్తల సమావేశాలు ప్రారంభించనుంది. సంస్థాగతంగా కార్యకర్తలను ఉత్తేజపర్చేందుకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా ఆఫీస్ బేరర్ల మీటింగ్‌ల్లో పాల్గొననున్నారు. వీటిలో భాగంగా తొలి సమావేశం తెలంగాణలో జరగనుంది. ఇటీవలే ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎల్‌బి స్టేడియంలో జరిగే బూత్‌లెవల్ మీటింగ్‌లో ఖర్గే పాల్గొంటారు. జనవరి 28వ తేదీన ఉత్తరాఖండ్, 29న ఒడిస్సా, ఫిబ్రవరి 3న ఢిల్లీ, 4న కేరళ, 10న హిమాచల్ ప్రదేశ్, 11న పంజాబ్, 13న తమిళనాడు, 15న ఝార్ఖండ్ సమావేశాలు నిర్వహించ నున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. బూత్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు కేడర్‌తో ఖర్గే సమావేశమవుతారని తెలిపారు. వచ్చే ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తారన్నారు. ఇటీవల జనవరి 4వ తేదీన జరిగిన ఓ సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ రేయింబవళ్లూ శ్రమించి 2024లో ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. విభేదాలను పక్కన పెట్టాలని, మీడియాలో పార్టీ అంతర్గత విషయాలను ప్రస్తావించవద్దని ఆయన శ్రేణులకు సూచించారు.

## ఏపీలో గ్రూప్-1 ఉద్యోగ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఏపీలో గ్రూప్-1 ఉద్యోగాల నోటిఫికేషన్

జనవరి 21తో ముగిసిన దరఖాస్తుల గడువు

జనవరి 28 వరకు

పొడిగించిన ఏపీపీఎస్సీ

గడువు మరోసారి పొడిగించబోమని స్పష్టీకరణ

ఏపీలో గ్రూప్-1 ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. తొలుత పేర్కొన్న ప్రకారం గ్రూప్-1 ఉద్యోగ దరఖాస్తుల గడువు జనవరి 21తో ముగిసింది. అయితే, దరఖాస్తుల గడువును ఏపీపీఎస్సీ నేడు పొడిగించింది.




జనవరి 28వ తేదీ అర్ధరాత్రి వరకు అభ్యర్థులు ఆన్ లైన్ లో గ్రూప్-1 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది. అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పొడిగింపు నిర్ణయం తీసుకున్నామని, మరోసారి పొడిగించేది లేదని స్పష్టం చేసింది. నోటిఫికేషన్ లో పేర్కొన్నట్టే... మార్చి 17న గ్రూప్-1 ప్రిలిమ్స్ జరుగుతుందని వెల్లడించింది. గ్రూప్-1 ఉద్యో గాలకు దరఖాస్తు చేసు కునేందుకు https://psc.ap.gov.in వెబ్ పోర్టల్ ను సంద ర్శించాలని ఏపీపీఎస్సీ సూచించింది.

## రామ్ లల్లా పేరు బాలక్ రామ్ గా మార్పు

అయోధ్య బాల రాముడి పేరు మార్పు.. ఇకపై ఈ పేరుతో పిలుస్తారు!

ఆలయాన్ని బాలక్ రామ్ మందిర్ గా పిలుస్తామన్న ట్రస్ట్ పూజారి

గర్భగుడిలో కొలువుదీరిన రాముడి వయసు ఐదేళ్లని వెల్లడి




అయోధ్యలోని రామ మందిరంలో బాల రాముడు కొలువుదీరిన సంగతి తెలిసిందే. గర్భగుడిలో నిన్న జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూసి యావత్ దేశం పులకించింది. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అక్కడ కొలువైన బాల రాముడిని ఇప్పటి వరకు రామ్ లల్లా అని పిలిచారు. ఇప్పుడు బాల రాముడి పేరును మార్చారు. ఇకపై రామ్ లల్లాను 'బాలక్ రామ్'గా పిలవనున్నట్టు ట్రస్ట్ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీరాముడు ఐదేళ్ల పసిబాలుడని... అందుకే బాలక్ రామ్ పేరును నిర్ణయించామని చెప్పారు. ఇకపై ఆలయాన్ని బాలక్ రామ్ మందిర్ గా పిలుస్తామని తెలిపారు. మరోవైపు, స్వామికి రోజుకు ఆరుసార్లు హారతిని ఇస్తామని ట్రస్ట్ కు చెందిన ఆచార్య మిథిలేశ్ నందిని తెలిపారు. మంగళ, శ్రింగార, భోగ, ఉతపన్, సంధ్యా, శయన హారతి ఇస్తామని చెప్పారు. పూరి, కూరతో పాటు పాలు, పండ్లు, రబ్ డీ ఖీర్, పాలతో చేసిన స్వీట్లను నైవేద్యంగా సమర్పిస్తామని తెలిపారు. ఈరోజు నుంచి బాల రాముడి దర్శనానికి సామాన్య ప్రజలను అనుమతించారు. దీంతో, ఆలయం దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతోంది.

## బీహార్ మాజీ సీఎం, దివంగత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న

శతజయంతి సందర్భంగా భారత అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించిన కేంద్రం

1924 జనవరి 24న జన్మించిన కర్పూరీ ఠాకూర్

రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పని చేసిన ఠాకూర్



బీహార్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించింది. ఆయన శతజయంతి సందర్భంగా మరణానంతరం అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించారు. 1924 జనవరి 24న ఆయన జన్మించారు. రేపు ఆయన శతజయంతి నేపథ్యంలో బీహార్ ప్రజలకు శు భవార్త అందించింది. కర్పూరీ ఠాకూర్ 1988 ఫిబ్రవరి 17న కన్నుమూశారు. ఆయన రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పని చేశారు. 1970 నుంచి 1971 వరకు మొదటిసారి, 1977 నుంచి 1979 వరకు రెండోసారి సీఎంగా పని చేశారు. బీహారీలు ఆయనను గౌరవంగా 'జన్ నాయక్'గా పిలుచుకుంటారు.

## రాహుల్ యాత్ర అసోంలో
# అడ్డగింత



అడుగుడుగనా బారికేడ్ల ఏర్పాటు

గౌహతి సిటీలోకి రాకుండా నిషేధాజ్ఞలు

రాహుల్ నక్సల్స్ పంథా అనుసరిస్తున్నారు

మండిపడ్డ సీఎం హిమంత బిశ్వశర్మ

రాహుల్‌పై కేసు పెట్టాలని పోలీసులకు ఆదేశం

తన యాత్రతో బిజెపిలో భయం పట్టుకుందన్న రాహుల్

2లో

గౌహతి,జనవరి 23(మరో ఉదయం):

## ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో
# అధికార పార్టీ విఫలం

ప్రత్యేకహోదా కోసం ఏం చేశారో చెప్పండి

బిజెపికి ఊడిగం చేస్తున్న వారు ఎలా పోరాడతారు

శ్రీకాకుళం పర్యటనలో వైఎస్ షర్మిల విమర్శలు

శ్రీకాకుళం,జనవరి 23(మరో ఉదయం):

ప్రత్యేక మోదా సాధిస్తామని అన్నవారు ఎక్కడ పోయారని పిసిసి చీఫ్ షర్మిల ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు బిజెపికి ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు.ఏపీ ప్రజలు బీజెపికి చెందిన ఒక్క ఎమ్మెల్యేను గాని ఎంపీని గానీ గెలిపించారా అని అడిగారు. కానీ 23 మంది లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులందరూ బీజేపీకి బానిసలు అయ్యారని ఘాటుగా స్పందించారు. ఏపీనీ ఈరోజు బీజేపీ ఏలుతోందన్నారు. ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని బీజేపీని జగన్ ఒక్కరోజైనా ప్రశ్నించింది లేదన్నారు. కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదా తెస్తామన్నారు.. మరి ఇచ్చిన హామీ ఏమైంది.. దీనికి సమాధానం చెప్పాలని నిలదీశారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి రాజకీయంగా దూకుడు పెంచారు. ఇచ్ఛాపురం నుంచి తన యాత్రను చేపడతానన్నారు. అందులో భాగంగా ఇచ్ఛాపురంలో ప్రజలతో మమేకమయ్యారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్ పై కేసు పెట్టిందని ఆరోపిస్తున్నారు. కానీ అది నిజం కాదు. వాస్తవం వేరే ఉందన్నారు. సోనియా గాంధీ, రాజశేఖర్ రెడ్డిని ఎంతగా గౌరవిస్తుందో ఆమెను కలిసినప్పుడు నాకు అర్థం అయిందన్నారు. రాజీవ్ గాంధీ చనిపోయాక ఆయన పేరు కూడా సీబీఐ లిస్టులో చేర్చారు అన్నారు. ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలిసికూడా రాజశేఖర్ రెడ్డి పేరు పెట్టగలనా అని తన చేతిలో చేయి పెట్టి కళ్ళల్లోకి చూసి చెప్పారన్నారు. ఇది తెలియక చేసిన పొరపాటు కావచ్చు, తెలిసి చేసింది అయితే కాదన్నారు. ఇది రాజశేఖర్ రెడ్డి రక్తం, రాజశేఖర్ రెడ్డి బిడ్డ చెబుతున్న మాట అని ప్రజలకు తెలియజేశారు. రాజశేఖర్ రెడ్డి ఏ రోజు బీజేపీ సిద్ధాంతాలతో ఏకీభవించలేదు. ఎందుకంటే బీజేపీ ఒక మతతత్వ పార్టీ అని ఆరోపించారు. ఈరోజు ఏపీలో జరుగుతున్న పరిస్థితులు గమనిస్తే చాలా బాధాకరంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎమ్మెల్యేలందరూ బీజేపీకి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. అంతే కాకుండా ఆ పార్టీకి బానిసలు అయిపోయారని స్పందించారు. ఏపీ ప్రజలను కూడా ఆ పార్టీకి బానిసలు చేయాలని చూస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ మేలు కోరుకుంటున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. రాజశేఖర్ రెడ్డి గారి ఆఖరి కోరిక రాహుల్ గాంధీని ప్రధాని చేయడం అని పేర్కొన్నారు. మనసుపెట్టి ప్రజలంతా ఆలోచించండి..



## అయోధ్యను నా గుండెల్లో పెట్టుకొని ఢిల్లీకి తిరిగి వచ్చాను



అయోధ్యను నా గుండెల్లో పెట్టుకొని ఢిల్లీకి తిరిగి వచ్చాను... అయోధ్య ధామ్‌లో గడిపిన క్షణాలను ఎప్పటికీ మరిచిపోలేనని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రధాని లేఖ రాశారు. తమ ప్రభుత్వం అనుసరిస్తోన్న సబ్ కా సాత్ సబ్ కా వికాస్‌కు శ్రీరామచంద్రుడే స్ఫూర్తి అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఫలితం అన్ని చోట్లా కనిపిస్తోందన్నారు.మీరు రాసిన లేఖ తనకు అందే సమయానికి మనసు భావోద్వేగంతో నిండిపోయిందని.. దాని నుంచి బయటపడేందుకు మీ లేఖ ఎంతో సహాయపడిందని రాష్ట్రపతికి రాసిన లేఖలో ప్రధాని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడినట్లు తెలిపారు. ఇందుకు రాముడి మంత్రమే ఫలించిందన్నారు.అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ప్రధాని మోదీ 11 రోజుల పాటు నిష్ఠగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి... ప్రధానిని అభినందిస్తూ రెండు రోజుల క్రితం లేఖ రాశారు. ఈ లేఖకు ప్రధాని ప్రత్యుత్తరం రాశారు.

మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## పన్నుల హేతుబద్ధతతోనే రామరాజ్యం !

రామరాజ్య స్థాపనకు కంకణం కట్టుకున్న ప్రధాని నరేంద్రమోడీ..అందుకు అనుగుణంగా అడుగులు వేయాల్సి ఉంది. మోడీ సమర్థత కారణంగానే అయోధ్య రామమందిర వివాదం సమసింది.దాదాపు 500 ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం దక్కింది. ఈ వివాదంలో ఎందరో అసువులు బాసారు. ఇది రావణకాష్టం లా ఇలాగే ఉంటుందా అన్న భయాలు ఉండేవి. అలాగే మోడీ సమర్థత కారణంగానే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దయ్యింది. ఆయన సమర్థత కారణంగానే పలు సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఈ క్రమంలో ఇక సామాన్యుల బతుకులు బాగుపడేలా చర్యలకు పూనుకోవాల్సి ఉంది. ఇవే ఇప్పుడున్న ప్రధాన సవాళ్లుగా గుర్తించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలుసుకుంటేనే ఈ సమస్యలు అర్థం అవుతాయి. ప్రధానంగా ఆహార ధాన్యాల ధరలను అదుపు చేయడం, పెట్రో ధరలను జిఎస్టీ పరిధిలోకి తీసుకుని రావాల్సి ఉంది. ఎందు కంటే ఏకీకృతపన్ను విధానం గురించి చెబుతున్న మోడీ ఇక్కడ మాత్రం ఇంకా వ్యాట్ అమలు చేయడం సరికాదు. అలాగే జిఎస్టీతో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ప్రధానంగా జిఎస్టీని వ్యాపారులు కట్టే పన్నుగా చూడరాదు. ఇది నేరుగా ప్రజలపై భారం పడుతోంది. దీంతో బంగారం కొనేవాళ్లకు, ఇళ్లు కొందామను కున్న వారికి, ఇన్సూరెన్స్ తీసుకుంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతు న్నారు. మోయలేనంతగా పన్నుల భారం ప్రజల నడ్డి విరుస్తోంది. ఇన్‌కమ్ టాక్స్ కూడా వెసలుబాటు చూడాలి. నెలకు లక్షా 70 వేల కోట్ల ఆదాయం జిఎస్టీ ద్వారా వస్తుందని అనుకోవడం సరికాదు. హేతుబద్దీకరణ చేస్తే 2 లక్షల కోట్లు కూడా రాబట్టవచ్చు. ఈ క్రమంలో ఎన్నికలకు వెళుతున్న వేళ సామాన్యుల గుండె చప్పుడు వినాలి. సామాన్యుల మన్‌కీ బాత్ వింటేనే సమస్యలు తెలుస్తాయి. ఢిల్లీలో అధికారులతో కూర్చుంటే సమస్యలు అర్థం కావు. జిఎస్టీ గురించి చర్చ పెట్టాలి. మరో వారం రోజుల్లో పార్లమెంట్ ముందుకు బడ్జెట్ ప్రతిపాదనలు రానున్నాయి. ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్‌కు వెళతారు. ఇప్పటికే ఏ రంగానికి ఎంత కేటాయింపులో నిర్ణయించి ఉంటారు. అయితే ఎన్నికల కు ముందు అన్న ధోరణి చాలాకాలంగా నడుస్తోంది. అలా కాకుండా దేశంలో ప్రజలు తమ బతుకులు తాము బతికేలా చూడాల్సిన అవసరం ఉంది. పెట్రో, గ్యాస్, ఇంటి కొనుగోళ్లు, ఉద్యోగాలకు అవసరమైన అవకాశాలు రావాలి. కేంద్రంలో ఉన్న బిజెపి కావచ్చు..రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు కావచ్చు... ప్రజలను దృష్టిలో పెట్టుకుని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. ఉన్న దాంట్లో సర్దుకుని బతుకుదామనుకున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పన్నుల భారంతో ప్రజల నడ్డి విరుగుతోంది. భవిష్యత్తు మీద, దేశ ప్రజల మీద ఆలోచనలు లేని ప్రభుత్వాలు ప్రజల మీద స్వారీ చేస్తున్నాయి. కరోనాతో పూర్తిగా దివాళా తీసిన ప్రజలపై ధరలతో దాడులు చేస్తున్నారు. వారి నడ్డివిరిగి లేవలేని విధంగా మోదుతున్నారు. అధికార దండం ఉందికదా అన్న రీతిలో పాలకుల తీరు ఉంది. సామాన్యుడు బతకడమెలా అన్నది ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. ఏం చేస్తే బాగుపడతారు..ఎలా చేస్తే ఉపాధి దొరుకుతుంది..ఏ పథకాల వల్ల నిరుద్యోగం పోతుంది.. ఏం చేస్తే రైతులు బతుకుతారు.. నిరుద్యోగు లకు ఉపాధి లేదా ..ఉద్యోగం కల్పించడం ఎలా అన్నఆలోచనలను పాలకులు విస్మరించారు. తాము చేసేదే గొప్ప అన్న రీతిలో పాలకలు ముందుకు సాగుతున్నారు. దేశంలో ఇంధన ధరలు చూస్తుంటే పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు బలవుతున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కేంద్రం సామాన్యుల గురించి మాట్లాడడం లేదు. చాయ్‌వాలానని ఘనంగా చెప్పు కుంటున్న ప్రధాని మోడీ గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా..రెండు సార్లు ప్రధానమంత్రిగా వెలుగొందుతున్నా.. సామాన్యుల నాడి పట్టడంలో

విఫలమయ్యారు. అయోధ్య ప్రారంభోత్సవంలో రామరాజ్యం గురించి ప్రస్తావించారు కనుక..ఇప్పటికైనా ప్రజల మన్‌కీ బాత్ అర్థం చేసుకోవాలి. జిఎస్టీ పేరుతో లక్షల కోట్లు వసూలు చేయడం పరమావధిగా బిజెపి ప్రభుత్వం సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలతో ఓరకంగా చెప్పాలంటే సర్కార్ వ్యాపారం చేస్తుందనే చెప్పాలి. ఇబ్బడిముబ్బడిగా పన్నులు పెంచుతూ దానిని ప్రజలకు అందకుండా చేస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సరుకు రవాణా భారం పెరిగి వివిధ రకాల వస్తువులపైనా ధరల మోత మోగుతుందన్న ఆలోచన చేయడం లేదు. పెట్రోల్ అన్నది సామాన్యుని వస్తువు. కార్లు, టూ వీలర్లు ఇప్పుడు సామాన్యుల కోసం మాత్రమే అని గుర్తించాలి. రవాణా కోసం వారు వీటిని ఉపయోగించక తప్పడం లేదు. మనదేశంలో సరైన ప్రజారవాణా లేకపోవడం వల్ల సామాన్యులు సైతం టూ వీలర్లను, కార్లను ఉపయోగిస్తున్నారు. ఇంధన ధరలు మండిపోతుండటంతో వినియోగ దారులపై భారాన్ని తగ్గించేం దుకు సుంకాన్ని తగ్గించాల్సి కేంద్రం,రాష్ట్రాలు దాని గురించి ఆలోచించడం లేదు. ఇప్పటికే ధరలమోత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్య దేశంలో వంటగ్యాస్ భారం కూడా సామాన్యులపై పడింది. భారత్‌ను ఏళ్లుగా నిరుద్యోగ సమస్య వెంటాడుతోంది. ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. తక్షణమే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నా.. వాటిని విస్మరించారు. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పన, తయారీ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలకు కేంద్రం విరివిగా ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగాలి. అందుకు బడ్జెట్ సమావేశాల్లో ప్రణాళిక సాగాలి. బడ్జెట్ ద్వారా ప్రజల కష్టాలకు చెక్ పడాలి. ఉన్న ఆదాయవనరులను పేదలకు ఉపయోగపడేలా, సామాన్యులకు ఊరడింపు కలిగేలా చర్చలు చేయాలి. బడ్జెట్ అన్నది ఏటా జరిగే ఓ తంతుగా మారరాదు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకుని ముందుకు సాగాలి. ఎన్నికలు వస్తున్న తరుణంలో మోడీ ప్రభుత్వం మరోమారు ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నది. ప్రజలంతా నిస్సత్తువగా ఆశగా చూస్తున్న వేళ బడ్జెట్‌పై ఆశలు కలిగించాలి. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక వ్యవస్థ ఉత్తేజానికి చర్యలు చేపడుతూనే దీర్ఘకాలంగా ఉన్న నిరుద్యోగం, ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై దృష్టి సారించాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి

# రాహుల్ యాత్ర అసోంలో అడ్డగింత

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరుగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రను అస్సాం పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు గువాహటి నగరంలోకి ప్రవేశించకుండా సరిహద్దుల వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశారు. అయినప్పటికీ దూసుకురావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం తర్వాత రాహుల్ యాత్ర అస్సాం నుంచి నాగాలాండ్‌లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. తిరిగి మంగళవారం ఉదయం ఇరు రాష్ట్రాల సరిహద్దుకు చేరుకున్న రాహుల్.. స్థానిక యువతతో సంభాషించారు. అక్కడి నుంచి గువాహటి నగరానికి బయల్దేరారు. అయితే, కాంగ్రెస్ పార్టీ తమ యాత్ర మార్గాన్ని మార్చు కోవాలని అంతకుముందు అస్సాం ప్రభుత్వం ఆదేశించింది. ట్రాఫిక్ కారణాల దృష్ట్యా గువాహటిలో యాత్రకు అనుమతించడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఉదయం వెల్లడించారు. నగర బైపాస్ మీదుగా వెళ్లాలని సూచించారు. కానీ, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గువాహటి చేరుకున్నారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం

నెలకొంది. బారికేడ్లను దాటుకుని కార్యకర్తలు దూసుకొస్తుండగా పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ అక్కడే ఉన్నారు. ఈ ఉద్రిక్తతలపై రాహుల్ మాట్లాడుతూ..ఇదే మార్గంలో బజ్‌రంగ్ దళ్ యాత్ర చేపట్టింది. భాజపా చీఫ్ నడ్డాజీ ర్యాలీ నిర్వహించారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు రాలేదు. ఇప్పుడు మాత్రం మాకు బారికేడ్లు పెట్టారు. మేం వాటిని మాత్రమే దాటాం. చట్టాన్ని అతిక్రమించలేదని అన్నారు. దీనిపై అస్సాం సీఎం హిమంత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇది మా సంస్కృతి కాదు. మాది శాంతియుత రాష్ట్రం. ఇలాంటి నక్సలైట్ వ్యూహాలకు మేం వ్యతిరేకం. ఘర్షణలు జరిగేలా కార్యకర్తలను రెచ్చగొట్టినందుకు గానూ రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించా. కాంగ్రెస్ తమ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియోలనే సాక్ష్యాలుగా పరిగణించాలని చెప్పా అని సీఎం వెల్లడించారు. సోమవారం కూడా రాహుల్ యాత్ర సందర్భంగా అస్సాంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రముఖ వైష్ణవ సాధువు శ్రీమంత్ శంకర్‌దేవ జన్మస్థలి బతద్రవ సత్రను దర్శించుకోకుండా రాహుల్‌ను అడ్డుకున్నారు. దీనిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, మేఘాలయలో యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్




ఇష్టాగోష్ఠికి స్థానిక అధికారులు అనుమతులు ఇవ్వలేదు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మపై రాహుల్ గాంధీ మరోసారి ఫైర్ అయ్యారు. తానంటే హిమంత బిశ్వ శర్మకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.అసోం సీఎం హిమంత బిశ్వ ర్మ దేశంలోనే అత్యంత అవినీతిపరులైన ముఖ్యమంత్రులలో ఒకరని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ అన్నారు. తన యాత్రకు బీజేపీ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. తనను ఎంత ఇబ్బంది పెడితే అంత మంచి జరుగుతుందన్నారు. తనను కావాలనే కాలేజీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని అన్నారు. బీజేపీ తీరును యావత్ దేశం గమనిస్తోందన్నారు. మంగళవారం రాజధాని గౌహతి సమీపంలోని ఖానాపరాలో భారత్ జోడో యాత్రను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కాంగ్రెస్ శ్రేణులపై లాఠీ చార్జ్ చేశారు. వర్శిటీ బయటే మాట్లాడిన రాహుల్ తాను విద్యార్థులను కలిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందులేంటని ప్రశ్నించారు.

# మీరు కట్టిన రాజధాని.. పోలవరం చూపిస్తారా ?










**అభివృద్ధి ఎక్కడో చూపితే అక్కడికే వస్తా**

**నాతోపాటుమేధావులు, ప్రతిపక్షాలూ వస్తాయి**

**వైవి సుబ్బారెడ్డికి సవాల్ విసిరిన షర్మిల**

**శ్రీకాకుళం నుంచి జిల్లా పర్యటనలు ప్రారంభం**

**బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో మమేకం**

**శ్రీకాకుళం,జనవరి23(మరో ఉదయం):**

అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపిస్తే వచ్చి చూడానికి తాను సిద్దంగా ఉన్నానని వైసిపికి కాంగ్రెస్ ఎపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. జిల్లా పర్యటనల్లో ఉన్న షర్మిల వైసీపీ నేతలకు ఘాటు రిప్లై ఇచ్చారు. వైవీ సుబ్బారెడ్డి చెప్పనట్టు చర్చకు తాను సిద్ధమని తనతోపాటు మేధావులు, ప్రతిపక్షనేతలు వస్తారని టైం ప్లేస్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపై జగన్‌ను అన్నయ్యగారూ అని పిలుస్తానంటూ కామెంట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్‌గా నియమితురాలైన వైఎస్ షర్మిల జిల్లాల పర్యటన ప్రారంభించారు. సోమవారం ఆమె ప్రకటించినట్టుగానే ఎన్నికలకు ముందు ఆమె శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి.. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కీలకమైన శ్రీకాకుళం నుంచి షర్మిల తన యాత్రను ప్రారంభించారు. జిల్లాలోని పలాస నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సు ఎక్కిన షర్మిలా రెడ్డి ఇచ్ఛాపురం వరకు బస్సులోనే ప్రయాణించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాకూర్, ఏపీసీసీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి తదితరులు ఉన్నారు. పలాస నుంచి బస్సులో ప్రయాణించిన వైఎస్ షర్మిల.. ఈ సందర్భంగా బస్సులోని ప్రయాణికులతో ముచ్చటించారు. సాధారణ ప్రయాణికుల మాదిరిగా వారి పక్కనే కూర్చున్న షర్మిల రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పరిస్థితులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వారికి జరుగుతున్న ప్రయోజనం వంటివాటిని కూడా ఆరా తీశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిలను మీడియా పలకరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జి సుబ్బారెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా రాష్ట్రంలో అభివృద్ధి లేదన్న షర్మిల వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇస్తూ.. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని, ఎవరు వచ్చినా.. అభివృద్ధి ఎక్కడ ఎలా జరిగిందో చూపిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా జగన్‌రెడ్డి అని సంబోధించడాన్ని వైవీ తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలపై షర్మిల స్పందిస్తూ.. సుబ్బారెడ్డి గారు. .జగన్ రెడ్డిగారు అనటం నచ్చలేదంటున్నారు. సరే జగన్ అన్నగారూ అనే అందాము. దానికి ఏమీ అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. వైవీ సుబ్బారెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి చూపిస్తామన్న వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల స్పందించారు. వైవీ సుబ్బారెడ్డి గారు ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తామన్నారు. మేము చూడటానికి సిద్ధంగా ఉన్నాం. టైం,డేట్ మీరు చెప్పిన సరే,మమ్మల్ని చెప్పమన్నా సరే రెడీ. మీరు చేసిన అభివృద్ధి చూసేందుకు మేమే కాదు, మీడియా, మేధావులు, ప్రతిపక్ష పార్టీల వారు కూడా వస్తారు. మీరు చేపట్టిన అభివృద్ధి, మీరు నిర్మించిన రాజధాని ఎక్కడ, మీరు కట్టిన పోలవరం ప్రాజెక్టు ఎక్కడ? మీరు నడుపుతున్న మెట్రో ఎక్కడో చూపించండి. చూడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా కళ్ళల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నాం. చూపించండి‘ అని షర్మిల వ్యాఖ్యానించారు. వైవీ సుబ్బారెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్న వైఎస్ షర్మిల ప్రకటించడంతో

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ, కాంగ్రెస్ పార్టీలమధ్య రాజకీయం మరింత వేడెక్కింది. అభివృద్ధి చూపించాలని షర్మిల సవాల్ విసరడంతో ఇప్పుడు వైవీ ఎలా స్పందిస్తారు? ఎక్కడ అభివృద్ధి చూపిస్తారు? లేక.. సాధారణ రాజకీయ సవాళ్లు ప్రతిసవాళ్లుగానే ఈ అంశాన్ని వదిలేస్తారా? అనేది ఆసక్తిగా మారింది. ఎన్నికలకు ముందు.. అభివృద్ధి విషయాన్ని లేవనెత్తడం.. సవాళ్లు విసురుకోవడం, టైం-డేట్ వంటి కామెంట్లు చేయడం మరింతగా రాజకీయ సెగ పెంచిందనే చెప్పాలి. చూడాలి ఏం జరుగుతుందో.

ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్సెస్ విపక్షాల మధ్య విమర్శలు- ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు వైసీపీని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నేతలు ధాటిగా విమర్శించేవారు. ఇప్పుడు ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల చేరిపోయారు. పీసీసీ చీఫ్ పదవీ చేపట్టిన వెంటనే జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇచ్ఛాపురం పర్యటనలో వైసీపీ, వైవీ సుబ్బారెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

వైఎస్ షర్మిల ఏపీ పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. షర్మిలకు ఇక్కడి అభివృద్ధి ఏం తెలుసు అని ఆయన ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలపై ఈ రోజు షర్మిల స్పందించారు. 'మీరు చేసిన అభివృద్ధి చూపించండి. డెవలప్ మెంట్ చూడటానికి సిద్ధంనా ఉన్నా. డేట్, టైం మీరు చెబుతారా..? నన్ను చెప్పమన్నా చెబుతా. ఆ డిబేట్‌కు మేధావులను పిలుద్దాం. నాతో పాటు మీడియా వస్తుంది. ప్రతిపక్షాలు వస్తాయి. గత నాలుగున్నరేళ్లలో మీరు చేసిన అభివృద్ధిని మా అందరికీ చూపించండి. మీరు అభివృద్ధి చేసింది ఎక్కడ ? మీరు చెప్పిన రాజధాని ఎక్కడా? పోలవరం ప్రాజెక్ట్ ఎక్కడా? మీ అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూడాలని అనుకుంటున్నారు. మీ సవాల్‌ను స్వీకరిస్తున్నా అని' వైఎస్ షర్మిల ఓపెన్ ఛాలెంజ్ చేశారు. షర్మిల ఛాలెంజ్‌పై వైవీ సుబ్బారెడ్డి స్పందించాల్సి ఉంది.

షర్మిల తన సోదరుడు ఏపీ సీఎం జగన్‌ను ఇటీవల జగన్ రెడ్డి అని పిలిచారు. అలా పిలవడం వైవీరెడ్డికి నచ్చలేదట.. ఇక నుంచి 'జగన్ అన్న గారు' అని పిలుస్తా అని ప్రకటించారు. జగన్‌ను అలా పిలవడానికి తనకేం అభ్యంతరం లేదని షర్మిల సెటైర్లు

# మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు జనవరి : 23 మరో ఉదయం**

మణుగూరు ఏరియా లో విధులు నిర్వహిస్తు పనిలో ఎంతో నిబద్ధతతో వృత్తి నైపుణ్యాత చూపుతూ అంకితభావంతో పనిచేస్తున్న మణుగూరు ఉద్యోగులు ఈ క్రింద వారిని రిపబ్లిక్ డే -2024 సందర్భంగా ఉద్యమ ఉద్యోగులుగా ఉత్తమ అధికారిగా సత్కరించుటకు ఎంపిక చేయడం జరిగింది. ఉత్తమ ఉద్యోగులను తేదీ 26-01-2024 శుక్రవారం ఉదయం భద్రాద్రి స్టేడియం పివి కాలనీ ప్రాంగణంలో జరిగే గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం. రామచందర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేసి సత్కరించబడును. అలాగే ఉత్తమ సింగరేణియస్, ఉత్తమ అధికారి అవార్డు గ్రహీతలకు కొత్తగూడెంలో జరిగే ప్రధాన వేడుకల్లో సింగరేణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఐ ఆర్ ఎస్ బహుమతులు ప్రధానం, సన్మానం, జరుగుతుంది.




# అధికారం కోల్పోయాక అమరులపై ప్రేమ

## త్యాగాలు చేసిన వారికి టిక్కెట్లు ఇస్తారా

## బిఆర్ఎస్‌కు బిజెపి నేత రఘునందన్ సవాల్

**హైదరాబాద్,జనవరి23(మరో ఉదయం):**

అధికారం కోల్పోయాక కార్యకర్తలు గుర్తొచ్చారా అంటూ బీఆర్ఎస్‌ను బీజేపీ నేత రఘునందనరావు ఎద్దేవా చేశారు. త్యాగం చేసిన కుటుంబాలకు సీట్ల అవకాశం ఇస్తామని చెప్పే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్‌కు ఉందా అని నిలదీశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమకారులకు సీట్లు ఇస్తామంటోన్న కేటీఆర్.. మాటను నిలబెట్టుకోవాలన్నారు. శంకరమ్మ విషయంలో తమరు ఇచ్చిన మాట గుర్తు లేదా అని ప్రశ్నించారు. అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాసి అసలైన ఉద్యమకారులకు అవకాశం ఇస్తామని ప్రమాణం చేయాలన్నారు. మల్లన్న సాగర్, పోచమ్మసాగర్‌తో బీఆర్ఎస్ వందల కోట్లు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. పొత్తు కుదరదని మోదీ చెప్పిన రోజే.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తెగదెంపులు అయ్యాయన్నారు. తెలంగాణా సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టారన్నారు. ఎంఐఎంతో నిన్నటి వరకు పొత్తు పెట్టుకుంది బీఆర్ఎస్ అని.. అదే ఎంఐఎంతో ఇప్పుడు కాంగ్రెస్ దోస్తీ చేస్తుందన్నారు. అప్పనంగా ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడికి భూములు అప్పగించి అధ్యక్షుడిని చేశారన్నారు. కవితకు సీటు ఇస్తారా?.. ఇవ్వరా? అసలు కవిత బీఆర్ఎస్‌లో ఉందా లేదా? అని ప్రశ్నించారు. మొదట శంకరమ్మ, ఎర్రోళ్ల శ్రీనివాస్ లాంటి వాళ్లకు సీట్లు ఇవ్వాలని రఘునందనరావు హితవుపలికారు. ఉద్యమకారులకు సీట్లు ఇస్తామంటోన్న కేటీఆర్..శంకరమ్మ విషయంలో మీరు ఇచ్చిన మాట గుర్తు లేదా అని నిలదీశారు. తెలంగాణా సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టిర్రని అన్నారు. ఎంఐఎంతో నిన్నటివరకు పొత్తు పెట్టుకుంది బీఆర్ఎస్..అదే ఎంఐఎంతో ఇప్పుడు కాంగ్రెస్ దోస్తీ చేస్తుందని చెప్పారు. అప్పనంగా ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడికి భూములు అప్పగించారని విమర్శించారు.

# అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

## భక్తుల కోసం స్పెషల్ ట్రైన్స్

**హైదరాబాద్,జనవరి23(మరో ఉదయం):**

అయోధ్య అందుబాటులోకి రావడంతో ఇప్పుడంతా అక్కడికి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం ట్రావెల్ ప్లాన్‌లో ఉన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అయోధ్యకు వెయ్యి ప్రత్యేక రైళ్లను వేయడం జరిగింది. బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్యకు తెలంగాణ నుంచి రైళ్లు వేశారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 15 వరకూ కేంద్రం అయోధ్యకు రైళ్ళు నడపనుంది.పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అయోధ్యకు తెలంగాణ భక్తులు వెళ్లనున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 200 మందికి అవకాశం కల్పించారు. అయోధ్యకు వెళ్ళి రావడానికి 5 రోజుల సమయం పడుతోంది. ప్రతి బోగికి ఒక ఇన్‌చార్జి... ప్రతి రైలుకు 20 బోగీలు ఉంటాయి. ఒక్కో ట్రైన్‌లో 14 వందల మందికి అవకాశం కల్పించనున్నారు. సికింద్రాబాద్, కాజీపేట రైల్వేస్టేషన్ల నుంచి ట్రైన్స్ ప్రారంభం కానున్నాయి.

# భూదాన్‌పోచంపల్లికి నకిలీల బెడద

## ఇక్కత్ ప్రింటెడ్ చీరల అమ్మకం

## నకిలీలపై ఫిర్యాదుతో విజిలెన్స్ దాడులు

**భూదాన్‌పోచంపల్లి,జనవరి23(మరో ఉదయం):**

భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చీరలకు నకిలీచెద పట్టింది. ఇక్కడి షాపుల్లో చీరలు అంటే నమ్మకంగా కొనుగోలు చేస్తారన్న బరోసాతో కొందరు సూరత్ నకిలీ ఇక్కత్ ప్రింటెడ్ చీరలు అమ్ముతున్నారు. భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలో కొన్ని షాపులు నకిలీ ఇక్కత్ చీరలు, నకిలీ ప్రింటెడ్ చీరలను విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం నాడు తనిఖీలు చేపట్టారు. హ్యాండ్లూమ్ షాపుల నుంచి నకిలీ ప్రింట్ ఉన్న చీరలను స్వాధీనం చేసుకున్నారు. ఆ షాపు యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఆ చీరలను పరిశీలించి చూస్తే తప్ప నకిలీవి అని తెలియదు. అచ్చం సూరత్ నుంచి తీసుకొచ్చిన చీరల మాదిరిగా కనిపించాయి. ఇక్కత్ చీరలు అంటే భూదాన్ పోచంపల్లి పెట్టింది పేరు. ఆ చీరలు ఇక్కడే పుట్టాయని చెబుతుంటారు. చీరలకు రంగులు వేసే సంప్రదాయ పద్ధతిని ఇక్కత్ అని పిలుస్తారు. చీరకు ఎక్కడ రంగు వేయాలో ఊహించుకొని అక్కడ వేస్తారు. ఈ పద్ధతిని రెసిస్ట్ డైయింట్ అంటారు. దారాలకు రంగులేసి, డిజైన్లను వేస్తారు. పురాతన పద్దతుల్లో రెసిస్ట్ డైయింగ్ ఒకటి. పోచంపల్లి ఇక్కత్ చీరలు 1800 కాలంలోనే మంచి పేరు గడించాయి. పోచంపల్లిలో దాదాపు 10 వేల కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాల జీవన ఆధారం చీరల నేయడమే. ఇక్కత్‌ను ఒక చీరల్లో కాదు సల్వార్లు, స్కర్ట్, అనార్కలీ, లెహంగాల్లో కూడా ఉపయోగిస్తారు. చీరల ప్రామాణికతను నిర్ధారించే జియగ్రాఫికల్ ఇండికేటర్ 2005లో పోచంపల్లికి లభించింది. పోచంపల్లి చీరలను సెలబ్రిటీలు ధరించారు. ఐశ్వర్యరాయ్ తన పెళ్లి, రిసెప్షన్‌లో పోచంపల్లి చీర కట్టుకున్నారు. అయితే ఇక్కత్‌కు కొందరు చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. భూదాన్ పోచంపల్లిలో గల షాపుల్లో కొందరు నకిలీ చీరలను విక్రయిస్తున్నారు. ఇతర చోట్ల నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి జనాలను మోసం చేస్తున్నారు. వారిని బురిడి కొట్టించి మోసం చేస్తున్నారు. విజిలెన్స్ అధికారుల సోదాలతో కొన్ని షాపు నిర్వాహకులు చేస్తోన్న మోసం బట్టబయలైంది. భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో వస్త్ర దుఖానాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్‌మెంట్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇక్కత్ వస్త్రాలను పోలిన డూప్లికేట్ చీరలను అమ్మకాలు జరుపుతున్నారన్న సమాచారంతో 15 మంది బృందంతో వస్త్ర దుఖానాల్లో తనిఖీలు చేపట్టారు.

## మండల కేంద్రంగా చెలరేగి పోతున్న

# మద్య మాఫియా..

**అధిక రేట్లకు మద్యం విక్రయాలు**

**ప్రభుత్వ నిబంధనలు బేకతారు**

**పట్టించుకోని ఎక్సైజ్ శాఖ**

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నె బాబు జనవరి : 23 మరో ఉదయం**

పినపాక నియోజక వర్గంలో లోని అశ్వాపురం మండలంలోని వైన్ షాపుల యజమానులు ప్రజలను దోచుకునేందుకు ఒక్కటయ్యారు. ఎక్సైజ్ మద్యం పాలసీ పేరిట ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు చేపట్టినా మద్యం సిండికేట్ దందా అడ్డగోలుగా కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఎక్సైజ్ మద్యం పాలసీలో భాగంగా వైన్‌షాపుల కోసం జోరుగా దరఖాస్తులు చేసుకొని ఎస్టీ, ఎస్సీ ల పేరిట మద్యందుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు అశ్వాపురం మండలంలో సిండికేట్‌గా మారి ఎమ్మార్పీ ధరకంటే అధికంగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు.ఈ దందా వెనుక మణుగూరు పట్టణానికి చెందిన ఓ బడా వ్యాపారి,సార పాక కు చెందిన మద్యం దుకాణాల నిర్వహణలో అరి తేరిన వ్యక్తి మండల కేంద్రంలోని సిండికేట్ దందా కు తెరలేపారు.అక్రమ దందా తో , మద్యం వ్యాపారం మూడు పెగ్గులు.. ఆరు సీసాలుగా కొనసాగుతోంది. అధికారులు ఎక్కడికక్కడే మామూళ్ళకు తెగబడడం వల్లే వ్యాపారులు మరింత రెచ్చిపోయి సిండికేట్ అవతారంలో మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే మరోవైపు గ్రామాల్లో జనాభాను బట్టి బెల్ట్‌షాపులకు వేలం పాటలు నిర్వహించి, సిండికేట్ వ్యాపారులు దుకాణాలు తమ ఆదీనం లోనే నడిపించు కుంటు న్నారు. అక్కడా ఎంత కల్తీ విక్రయాలు జరిగినా, అధికారులు కనీసం స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒక్కో బాటిల్‌పై రూ.10 నుండి 60 వరకు అదనంగా వసూలు చేస్తుండగా సామాన్య రైతులు, గ్రామీణ కూలీలు, కార్మీకులు మద్యానికి బానిసై జేబులు చిల్లు చేసుకుంటున్నారు. దీంతో సామాన్య మద్య తరగతి ప్రజలు మద్యానికి బానిసై ఆనారోగ్యానికి గురవుతున్నారు. కల్తీ మద్యంపై కూడా నిఘా లేకపోవడంతో సిండికేట్ వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోయింది.మండలంలో మూడు వైన్ షాపులు ఉండగా రెండు షాపులలో మాత్రమే రిటైల్ కౌంటర్లు నిర్వహిస్తూ, మండల కేంద్రంలోని మూడవ షాప్ మొత్తం ప్రత్యేకంగా బెల్ట్ షాపులకే తరలిస్తున్నారు . మద్యం సీసాలపై ప్రభుత్వం ముద్రించిన ధరల్లో 6 నుంచి 10శాతం అధిక ధరలకు బెల్టు షాపులకు విక్రయిస్తున్నారు.వైన్స్ షాపులు సిండికేట్ గా ఏర్పాటయ్యి బెల్టు షాపుల దందా విచ్చలవిడిగా కొనసాగిస్తున్న పరిస్థితి అశ్వాపురం మండల కేంద్రంలో నెలకొంది. గతంలో ఉన్న వాటి కంటే రెట్టింపు సంఖ్యలో బెల్టుషాపుల ఏర్పాటుతో వైన్స్ షాపుల యజమానులు జేబులు నింపుకుంటున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. మూడు వైన్ షాపులకు సిండికేట్ గా ఏర్పాటయ్యి బెల్టుషాపుల దందాను కొనసాగిస్తూ మద్యం ప్రియుల జేబులను గుళ్ళ చేస్తున్నారని, ఈ రెండు షాపులు మండల కేంద్రంలో ఒకటి, దాని పక్కన మరొకటి




ఏర్పాటు చేయడం వలన మండలానికి దూరంగా ఉండే గ్రామాల్లోని మద్యం ప్రియులకు బెల్టుషాపులే గతవుతున్నాయి. దీనితో వారు బెల్టుషాపులను ఆశ్రయించడం వలన బ్రాండ్ ను బట్టి రూ.40నుండి రూ.60, ఫుల్ బాటిల్ కు రూ. 50 నుండి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధిక రేటుపై ప్రశ్నిస్తే వైన్ షాప్ యాజమానులు మావద్ద క్వార్టర్ కు రూ.10, ఫుల్ బాటిల్ కు రూ.40 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని, ధరలు అదేవిధంగా అమ్ముతామని అంటున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు.

**బెల్ట్ షాపులకు ప్రోత్సాహం ఇస్తున్న వైన్ షాప్ యాజమాన్యం :**

అంతేకాకుండా తమ ఆదాయం రెట్టింపు కోసం బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వైన్ షాప్ యజమాన్యం వివిధ రకాల బ్రాండ్లు కలిగిన, కింగ్ ఫిషర్ బీర్, రాయల్ స్టాక్, ఐబీ, ఎంఎచ్ మద్యం బాటిల్ లను బెల్ట్ షాపులకు తరలిస్తూ మైదాన ప్రాంతంలో విక్రయాలు జరగని మద్యం సీసాలను వైన్ షాపుల్లో ఉంచుతూ మద్యం ప్రియులు మద్యం చేవించని పరిస్థితి ఏర్పడుతుంది.

**ఎక్సైజ్ అధికారుల దర్శన భాగ్యం ఎప్పుడు.?**

అక్రమ దందా అంత సిండికేట్ కనుసైగలోనే ఇదంతా జరుగుతుందని,ఎక్సైజ్ అధికారులు వైన్స్ షాపుల వైపు అసలు కన్నెత్తి చూడడం లేదు. నెల నెల వారికి మామూళ్లు వైన్స్ షాపుల నుండి అందుతున్నాయని, దీనితో వారు ఇటు వైపే రావడం లేదని మండల ప్రజలు అంటున్నారు. ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుపోవడం వలన వైన్స్ షాపు యజమానులు ఇష్టారీతిన బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారని, స్వయంగా ఎక్సైజ్ అధికారులే ఈ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తు న్నారని ప్రజలు అంటున్నారు.మండల పరిధిలోగల మద్యం షాపుల పై ఎక్సైజ్ అధికారులు కొరడాలు చూపించకుండా ఆదివాసి గుడాళ్లలో కళ్ళు స్థావరాలు పై మాత్రం వారి అధికారాన్ని చాలఇస్తున్నారని. అక్రమ మందు దోపిడీదారులు ఆగడాలను అరికట్టే అధికారుల దర్శన భాగ్యం ఎప్పుడు అవుతుంది అని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు ఈ సిండికేట్ దందాకు చెక్ పెట్టి వైన్స్ షాపుల పై చర్యలు తీసుకోవాలని,ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి మద్యం వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# నల్లగండ బిఆర్ఎస్‌లో ముసలం ?

**గుత్తా తీరుపై జగదీశ్ ఆగ్రహం**

**ఓటమికి కారణం ఆయనేనంటూ వ్యాఖ్యలు**

**రంగంలోకి దిగి సర్దిచెప్పిన కెటిఆర్**

**కొడుకు ఎంపి సీటు కోసం గుత్తా పట్టు**

**నల్లగొండ,జనవరి23(మరో ఉదయం):**

ఉమ్మడి నల్లగొండ బిఆర్ఎస్‌లో మెల్లగా ముసలం పుడుతోంది. మొన్నటి ఎన్నికల్లో సూర్యాపేట నుంచి మంత్రి జగదీవ్ రెడ్డి ఒక్కరే గెలుపొందారు. దీంతో ఆయన ఇతర నేతలపై పెత్తనం చెలయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మండలి ఛైర్మన్ గుత్తా సుకేందర్ రెడ్డి తీరుపైనా ఆయన వ్యాఖ్యలు చేయడంతో ఇప్పుడు సమస్య రాజుకుంది. ఆయన వల్లనే పార్టీ ఓడిందని వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై గుత్తా కూడా గట్టిగానే సమాధానం ఇవ్వాలని అనుకున్నారు. అయితే కెటిఆర్ వెంటనే రంగంలోకి దిగి ఆయనను బుజ్జగించారని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమికి తానే కారణమైతే ఖమ్మం, మహబూబ్ నగర్ , వరంగల్ జిల్లాలో ఓటమికి ఎవరు కారణమని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల్లో గాలి వచ్చింది.. పార్టీ ఓడిపోయిందన్నారు. అభివృద్ధి చేసిన మంత్రులు కూడా ఓడిపోయారని చెప్పారు. ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎంపీ సీట్లతో పాటు నల్గొండ సీటు విషయంలో కూడా టఫ్ ఫైట్ ఉందన్నారు గుత్తా. పార్టీ అవకాశం ఇస్తే తన కొడుకు అమిత్ భువనగిరి లేదా నల్లగొండ సీటు నుంచి లోక్ సభకు పోటీ చేస్తారని చెప్పారు. దీనిపై మరో మూడు నాలుగు రోజుల తర్వాత అధిష్టానం క్లారిటీ వస్తుందన్నారు. ఇదే విషయాన్ని కెటిఆర్‌కు సూచించానని అన్నారు. కాంగ్రెస్ కు తాను దగ్గరయ్యేది ఉంటే బీఆర్ఎస్ నుంచి తన కొడుక్కి టికెట్ ఎందుకు అడుగుతానని గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు. తనపై కొందరు కావాలని బురద వేసే ప్రయత్నంలో ఉన్నారని పరోక్షంగా జగదీశ్ రెడ్డిపై మండిపడ్డారు. తాను పార్టీ వీడుతానని ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. ఇకపోతే కృష్ణా ప్రాజెక్టులు కేంద్రం పరిధిలోకి వెళ్తే తెలంగాణకు గొడ్డలి పెట్టు లాంటిదని అభిప్రాయపడ్డారు. సాగు, తాగు నీళ్లకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్ట్ లు కెఆర్ఎంబి పరిధిలోకి పోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. ఉప ఎన్నికలు కాబట్టి ఎమ్మెల్యే కోటాలో రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు వేరువేరుగా జరిగాయన్నారు. బిఆర్ఎస్ బలంగానే ఉందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని గుత్తా




# ఉమ్మడి నల్లగొండలో రాజకీయ కాక

**వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యం**

**అధికార, విపక్ష పార్టీల మధ్య విమర్శల యుద్ధం**

**హైదరాబాద్,జనవరి23(మరో ఉదయం)**

ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో 11 సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండు పార్లమెంట్ స్థానాలను తిరిగి నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ దూకుడు పెంచింది. కంచుకోటగా ఉన్న ఉమ్మడి జిల్లాలో అధికార కాంగ్రెస్ సంస్థాగతంగా బలంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో టిక్కెట్ దక్కించుకుంటే గెలుపు ఖాయమనే అంచనాలో ఆశావాహులు ఉన్నారు. ఈ క్రమంలో పార్లమెంటు ఎన్నికలకు ముందే ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా మంత్రులు, మాజీ మంత్రి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు చేస్తున్నారు. దీనికి ప్రతిగా మంత్రి కోమటిరెడ్డి విమర్శల దాడి చేయడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయం వేడెక్కింది. శాసనసభ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ స్వీప్ చేయాలని భావిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీలో చాలామంది ఆశావాహులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పార్టీ అధిష్టానం పార్లమెంట్ ఎన్నికలపై తీవ్ర కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్?లో రెండు స్థానాలకు ఇద్దరు మంత్రులు ఇన్ చార్జులుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలో దెబ్బతిన్న బీఆర్ఎస్.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని వ్యూహాలు రచిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పన్నెండు స్థానాల్లో11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్మేల్ గెలువడం, ఒక్క సూర్యాపేటలోనే మాజీ మంత్రి జగదీష్ రెడ్డి గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసే దిశలో ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో ఏదో ఒక స్థానంలో అయినా విజయం సాధించాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది. నల్గొండ పార్లమెంటుకు మాజీ మంత్రి జగదీశ్వెడ్డి ఇన్చార్జిగా వ్యవహరించే అవకాశం ఉంది. మరోవైపు ఇప్పటి వరకు నల్గొండ స్థానంలో బీఆర్ఎస్?కు విజయం దక్కలేదు. దీంతో తాజాగా హైదరాబాద్‌లో జరిగిన పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ముఖ్యకార్యకర్తలు, నాయకులకు పార్టీ అధిష్టానం.. ఎన్నికలపై పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్లాలని, గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి మరింత ఉధృతంగా వెళ్లాలని సూచించింది.ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. మరో రెండు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా విమర్శలు, ప్రతి విమర్శలు తారాస్థాయి చేరుకున్నాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ అప్పట్లో మంత్రిగా పని చేసిన జగదీశ్ రెడ్డిపై నల్గొండ, భువనగిరి ఎంపీలుగా ఉన్న ఉత్తమ్, కోమటిరెడ్డిలు తీవ్రంగా విమర్శించేవారు. గతంలోనూ పలుమార్లు జడ్పీ సమావేశంలో మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. రెండేళ్ల క్రితం వానాకాలం పంటల సాగు సమీక్ష సమావేశంలోనూ ఉత్తమ్, జగదీశ్ రెడ్డిమధ్య మాటల యుద్ధం నడిచింది. ఇటీవల ఎన్నికల ప్రచారం పలు సందర్భాల్లో తమకు ఉమ్మడి జిల్లాలో జగదీశ్ రెడ్డియే ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విమర్శల పరంపర ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని చెబుతున్నారు. మాజీమంత్రి జగదీష్ రెడ్డికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం తర్వాత అరెస్టు అయ్యే రెండో వ్యక్తి జగదీశ్ రెడ్డి అని కోమటిరెడ్డి ÷ర్ అయ్యారు. తాము అనుకుంటే నెల రోజుల్లోనే బీఆర్ఎస్?ను 39 ముక్కలు చేస్తాం. కానీ మాకు అలాంటి సంస్కృతి లేదంటూ విమర్శల దాడిని పెంచారు. మాజీ మంత్రి కేటీఆర్, జగదీష్ రెడ్డిలు ఆహంకారం తగ్గించుకుంటే మంచిదని కోమటిరెడ్డి హితవు పలికారు. బీఆర్ఎస్?ను ముక్కలు చేయడం కోమటిరెడ్డి తాతతరం కూడా కాదని, వాళ్ల పాత బాస్ వైఎస్..ప్రస్తుత బాస్ చంద్రబాబు ఇద్దరు కలిసి కూడా బీఆర్ఎస్?ను ఏం చేయలేకపోయారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రతి విమర్శ చేశారు. కోమటి రెడ్డి ఎప్పుడు ఏం మాట్లాడుతారో ఎవరికీ తెలియదని జగదీశ్ రెడ్డి విమర్శించారు. దీంతో అధికార ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం ఉమ్మడి నల్లగొండ జిల్లా



మరో ఉదయం

# సినిమా వార్తలు

## సిద్దార్థ్ రాయ్ ట్రైలర్ విడుదల

చాలా చిత్రాల్లో బాల నటుడిగా నటించిన దీపక్ సరోజ్ ఇప్పుడు కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్దార్థ్ రాయ్'. దీనికి వి యశస్వి దర్శకత్వం వహించాడు. రధన్ సంగీతాన్నందించిన ఈ సినిమా ట్రైలర్ ఈరోజు విడుదలైంది. ఇందులో దీపక్ సరోజ్ సిద్దార్థ్ రాయ్ గా కనిపిస్తాడు, అలాగే అతని పాత్రకి రెండు వైవిధ్యాలున్నాయని అర్థం అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ చూసాక ఇది కొంచెం అర్జున్ రెడ్డి సినిమాతో పోలుస్తారు అని అనిపిస్తోంది. ఈ సినిమా టీజర్ గత సంవత్సర విడుదలైంది, అప్పుడే ఈ సినిమా ఒక విభిన్నమైన ప్రేమకథా చిత్రమని తెలిసింది. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ చూసాక ఈ సినిమా కచ్చితంగా వైవిధ్యంగా వుండబోతోంది అని కూడా తెలుస్తోంది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు ఈ సినిమాకి పనిచేశారని చిత్ర నిర్వాహకులు చెపుతున్నారు. కెమెరా శ్యామ్ కె నాయుడు, ఎడిటర్ ప్రవీణ్ పూడి పనిచేస్తుండగా ఈ సినిమాకి నిర్మాతలు జయ ఆడపాక, ప్రదీప్‌పూడి, సుధాకర్ బోయిన. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వి.యశస్వి. ఈ సినిమా ఫిబ్రవరి లో విడుదలవుతుందని ఈరోజు ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో చెప్పడం జరిగింది. ఇందులో కథానాయికగా తన్వి నేగి నటించగా, కీర్తన ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనుంది.






## రాముడి ప్రాణప్రతిష్ట.. నాకు ప్రత్యేకం నటి లావణ్యత్రిపారి వెల్లడి

అయోధ్యలో బాలరాయుని ప్రాణప్రతిష్ఠ సోమవారం శోభాయమానంగా జరిగింది. ఈ సందర్భంగా మెగా కోడలు లావణ్య త్రిపాఠీ ఓ ఆసక్తికర పోస్ట్ షేర్ చేసింది. అయోధ్యలో పుట్టిన ఆమె ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంది. రాముని జన్మస్థలమైన అయోధ్యలో పుట్టిన నేను ప్రాణ ప్రతిష్ట వేడుకను తిలకించటం అదృష్టంగా భావిస్తున్నాను. నాతో సహా భారతీయులందరికీ ఇది గర్వించదగ్గ విషయం. ఈ పండగ వాతావరణంలో నేను రామ్ పరివార్ జ్యువెలరీ ధరించడం సంతోషంగా ఉంది. విగ్రహ ప్రాణప్రతిష్ట కేవలం అయోధ్యలోనే కాదు దేశమంతా ప్రాధాన్యత సంతరించుకుంది. దేశమంతా ఏకతాటిపైకి వచ్చి రాముడి రాకను సంబరాలు చేసుకుంటోంది. ఇది మనందరినీ ఏకం చేసే ఉత్సవం. ఇది మనలో ఐకమత్యాన్ని, అన్ని వర్గాలవారూ ఒక్కటే అన్న భావాన్ని పెంపొందిస్తుంది. మనసులో అపార భక్తిని నింపుకుందాం.. అయోధ్యలోనే కాకుండా దేశమంతా శాంతియుతంగా ఉండాలని కోరుకుందాం.. జై శ్రీరామ్' అని తన పోస్ట్‌లో పేర్కొంది మెగా కోడలు లావణ్యా త్రిపాఠీ. ఈ పోస్ట్‌కు చీరకట్టులో ఉన్న ఫోటోను జత చేసింది. శ్రీరామపట్టాభిషేకాన్ని సూచిస్తున్నట్లుగా ఉన్న రామ్ పరివార్ ఆభరణం ఆకట్టుకుంది. ఆ ఆభరణాన్ని ధరించి అయోధ్య రామాలయ ప్రారంభ కార్యక్రమాన్ని సెలబ్రేట్ చేసుకుంది లావణ్య త్రిపాఠీ.

### అయలాన్-2 కూడా రెడీ

తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న నటుడు శివకార్తికేయన్. ఈ టాలెంటెడ్ హీరో నటించిన చిత్రం అయలాన్. ఆర్ రవికుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో టాలీవుడ్ భామ రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించింది. తమిళనాట పొంగళ్ కానుకగా జనవరి 12న విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. అయలాన్ తెలుగు వెర్షన్ జనవరి 26న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా తెలుగు రిలీజ్ డేట్ ఇంకా రాకముందే మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ అందించారు. ఈ సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ కూడా రెడీ అవుతున్నట్టు ప్రకటించారు. అయలాన్ 2 ఒకే అయింది. కేజేఆర్ స్టూడియోస్, ఫాంటోమ్‌ఎఫ్ ఎక్స్ స్టూడియో సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించాయి. అయలాన్ సక్సెస్‌తో తాము రెండో పార్టును మీ ముందుకు తీసుకురాబోతున్నట్టు తెలియజేశారు. కోలీవుడ్ నుంచి రాబోతున్న పర్‌ఫెక్ట్ పాన్ వరల్డ్ సినిమా కావడం ఖాయమని అంటున్నారు ట్రేడ్ పండితులు.

## లావణ్య త్రిపాఠీ, బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్

### మిస్ పర్‌ఫెక్ట్ వెబ్ సీరిస్

తెలుగు వెబ్ సిరీస్‌లు ఇప్పుడు విరివిగా వస్తున్నాయి. ప్రముఖ నటి లావణ్య త్రిపాఠీ, బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో 'మిస్ పర్ఫెక్ట్' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ని నిన్న విడుదల చేశారు. ఈ వెబ్ సిరీస్‌లో అభిజీత్ మెయిన్ రోల్ చేస్తున్నారని అన్నప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యాను అని చెప్పాడు దర్శకుడు విశ్వక్. 'నేను బిగ్ బాస్ చూడలేదు, కానీ అభిజీత్ చేసిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్', మరికొన్ని ప్రాజెక్ట్స్ చూశాను. తను ఆడిషన్ ఇవ్వాల్సిన అవసరం లేకున్నా..ఈ సిరీస్ కోసం ఆడిషన్ ఇచ్చాడు'. అని చెప్పాడు దర్శకుడు. ఇందులో లావణ్య లీడ్ రోల్ చేస్తున్నారు అనగానే ఆమె చేసిన 'అందాల రాక్షసి' లో ఆమె పర్ ఫార్మెన్స్ ఎలా ఉందో అలాంటి పర్ ఫార్మెన్స్ ఈ వెబ్ సిరీస్ లో కూడా తీసుకురావాలని అనుకున్నాను. కొత్త టాలెంట్ ను ప్రోత్సహించడం అంటే నాగార్జునకి చాలా ఇష్టం. న్యూ టాలెంట్ ను వెలుగులోకి తీసుకురావడమే ఈ సంస్థ ఉద్దేశం. ఇప్పుడు ఈ 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ తో మేము అదే ప్రయత్నం చేశాం, అని చెప్పారు నిర్మాత యార్లగడ్డ సుప్రియ. ఈ జర్నీలో హాట్ స్టార్ చాలా సపోర్ట్ చేసింది. ఈ సిరీస్ కోసం చాలా మంది అమ్మాయిలు నో చెప్పిన క్యారెక్టర్ చేస్తానంటూ ముందుకు వచ్చి తన గట్స్ ఎంటో ప్రూవ్ చేసింది అభిజ్ఞ. 'సోగ్గాడే చిన్ని నాయన' టైమ్ నుంచి లావణ్యతో నాకు మంచి స్నేహం ఉంది. మిస్ పర్ఫెక్ట్ కు తనే పర్ఫెక్ట్ అనిపించింది. ఒక చిన్న కథలో బలమైన క్యారెక్టర్స్ ఉండి మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. ఫిబ్రవరి 2న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో చూడండి, అని చెప్పారు సుప్రియ. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజున మా సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేసుకోవడం హ్యాపీగా ఉంది అని చెప్పారు ఈ వెబ్ సిరీస్ లో ప్రధాన పాత్ర పోషిస్తున్న లావణ్య త్రిపాఠి. 'ఈ సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. సిరీస్ కంప్లీట్ అయ్యేలోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యాను. ఈ సిరీస్ కు ముందు నేను చేసిన కొన్ని ప్రాజెక్ట్స్ కు స్ట్రెస్ ఫీలయ్యాను. అలాంటి టైమ్ లో 'మిస్ పర్ఫెక్ట్' లాంటి ఒక స్క్రిప్ట్ దొరకడం రిలీఫ్ లా ఫీలయ్యాను. పాజిటివ్ ఫీలింగ్ కలుగుతోంది. అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ట అభిజీత్ ముహూర్తంలో చేశారు. నా లైఫ్ లో ఇది మర్చిపోలేని సందర్భం అనుకుంటా, అని చెప్పాడు ఈ వెబ్ సిరీస్ లో లీడ్ యాక్టర్ గా వేసిన అభిజీత్. 'అన్నపూర్ణ సంస్థలో పనిచేయడం ఎప్పుడూ హ్యాపీగా ఉంటుంది. ఈ వెబ్ సిరీస్ స్క్రిప్ట్ బాగా నచ్చింది,లావణ్య గారితో కలిసి నటించడం సంతోషంగా ఉంది, అని చెప్పాడు అభిజిత్.







## ఇండియానా జోన్స్‌లా మహేశ్ సినిమా

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, అగ్ర దర్శకుడు రాజమౌళి కలయికలో 'ఎస్‌ఎస్‌ఎంబీ29' రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని సినీ ప్రియులు ఎంతో ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిత్ర రచయిత వి.విజయేంద్ర ప్రసాద్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా గురించి అప్‌డేట్ ఇచ్చారు. ఆ చిత్రం 'ఇండియానా జోన్స్'లా ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఈ సినిమాకి టైటిల్ ఖరారు కాలేదు. కథ ఎక్కువగా అడవి నేపథ్యంలో సాగుతుంది. పీరియాడికల్ కథ కాదు. స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి. మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయని తెలిపారు. 'ఈ సినిమాతో మహేశ్‌బాబు ఇమేజ్ మరింత పెరిగే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు 'ఏ సినిమాలో అయినా ప్రధాన పాత్ర పోషించే నటులకు మంచి గుర్తింపురావాలని మా వంతు ప్రయత్నం చేస్తాం' అని విజయేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అంతే కాదు బాలీవుడ్‌లో 'బజరంగి భాయిజాన్' సీక్వెల్ కథ పూర్తయిందని, సల్మాన్‌ఖాన్‌కు వినిపించానని చెప్పారు. చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవు తుందనేది చూడాలన్నారు. తన డ్రీమ్ ప్రాజెక్టు అయిన 'సీత'ను హాలీవుడ్ స్థాయిలో రూపొందిస్తామని, ఆ పాత్రకు సరిపడ కొత్త నటి కోసం అన్వేషిస్తున్నామని చెప్పారు.

Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com